నవతెలంగాణ

మెదక్

1

శనివారం | 16 నవంబర్ 2024 | www.navatelangana.com

మంత్రికి స్వాగతం పలికిన శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కుకాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. శుక్రవారం సిద్దిపేట నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దుద్దెడ టోల్ గేట్ వద్ద చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రితో కలిసి దుద్దెడ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్ర సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిద్దిపేట జిల్లా గ్రంథాలయ వార్షికోత్సవంలో కార్య క్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నా స్థలం నాకు ఇప్పించండి



నవతెలంగాణ-సిద్దిపేట

మా సొంత పట్టా భూమిని ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి, డబ్బు పలుకుబడితో మా భూమిని కబ్జా చేయాలన్న దురుద్దేశంతో అక్రమాలకు పాల్పడుతున్నారని బాధితుడు ఎక్కలదేవి లింగం తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టుకు కూడా తప్పుడు ధృవపత్రాలను అందించి కోర్టును కూడా మోసం చేస్తున్నారని అన్నారు. తతను నానా రాకాలుగా ఇబ్బందులకు గురిచేసి, తనను చంపాలని చూస్తున్నారని, తనకు న్యాయం చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

విరాళం పేరుతో రైతును మోసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు





నవతెలంగాణ-మిరుదొడ్డి

మోసపోయే వారు ఉంటే మోసం చేసేవారు రోజుకో రకంగా పుట్టుకొస్తునే ఉంటారు. ఇలా ఓ నయా మోసానికి అన్నదాత బలయ్యాడు. విరాళం పేరుతో మోసం చేసి దుండగులు ఉడాయించారని బాధితుడు వాపోయారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన తీపిరెడ్డి దుర్గారెడ్డి ఇంట్లో ఉన్న సమయంలో గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు ఇంట్లోకి వచ్చి, యాత్రిక, అవ్వహ, సత్ర నిర్మాణంకు రూ.20 వేల విరాళం ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. తనకు అంత స్తోమత లేదని రూ.500 వరకు ఇస్తానని బాధితుడు దుర్గారెడ్డి తెలిపినప్పటికీ, దుండగులు మాయ మాటలు చెప్పడంతో వరి కోత యంత్రం కోసం తీసుకువచ్చిన రూ. 5000లు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామంలోని అందరూ రూ.20 వేల వరకు ఇస్తున్నారని తెలపడంతో, అనుమానం వచ్చిన దుర్గారెడ్డి ఇతరుల వద్దకు వెళ్లి విరాళం ఎవరైనా ఇచ్చారా అని తెలుసుకుంటే ఎవరు కూడా విరాళం కోసం రాలేదని తెలిసిందన్నారు. వెంటనే వారిచ్చిన రసీదులోని నెంబర్‌కు ఫోన్ చేస్తే పొంతన లేని సమాధానం చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం జరిగిందన్నారు. విరాళం పేరుతో దుండగుల చేతిలో మోసపోయానని దుర్గారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మాయ మాటలు చెప్పి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరారు.

కొత్త ప్రణాళికతో ప్రజలకు మరింత అభివృద్ధి

జక్కాపూర్ గ్రామంలో కుటుంబ సర్వేలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

తెలంగాణలో కొత్త ప్రణాళికతో ప్రజా పాలన ద్వారా ముందుకు పోతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నారాయణరావు పేట మండలం జాక్కాపూర్ గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అధికారులు, ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపై ఎలాంటి అపోహలు అవసరం లేదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఇబ్బందులు లేవని ప్రజలే స్వచ్ఛందంగా సమాచారాన్ని ఇస్తున్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 85 వేల మంది ఎన్యుమరెటర్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతుందన్నారు. కుటుంబ సర్వేపై రాజకీయ నాయకులు దుష్ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. అందరూ సహకరించి స్వచ్ఛందంగా పాల్గొనాలి సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ, ఎంపీడీవో శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు మంద పాండు, ఫైజు వీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస దీపాల వెలుగులు అందరి జీవితలలో వెలగాలి

పరమశివుడి కృపా కటాక్షాలతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్



నవతెలంగాణ-పటాన్ చెరు

పరమశివుడు కృపా కటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్‌లు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ గడ్డం బాలమణి శ్రీశైలం ఏర్పాటు చేసిన కార్తీక మాస దీపోత్సవ కార్యక్రమానికి టీజీఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డితో కలిసి నీలం మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ నదుల నుంచి సేకరించిన జలాలచే 108 కలశాలతో కలషాభిషేకం నిర్వహించారు. మొదట లక్ష్మీ గణపతి హెూమంతో కార్యక్రమంలో రుద్రాభిషేకం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా కార్తీక మాసానికి దివ్యమైన విశిష్టత ఉందన్నారు.పరమ శివుడికి మహావిష్ణువుకి ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి శివ కేశవులను ఆరాధిస్తారని తెలిపారు. ఆ శివకేశవుల ఆశీస్సులతో కార్తీక దీపాల వెలుగులు ప్రజలందరి జీవితాల్లో వెలగాలని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి, నీలం మధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



డ్రగ్స్ కట్టడి ఎక్కడా...!

మొక్కుబడికే ప్రహారీ క్లబ్‌లు

- కార్యాచరణ.. సమావేశాల్లేవు
- యథేచ్ఛగా గంజాయి, డ్రగ్స్
- పాడవుతున్న పిల్లల ఉజ్వల భవిష్యత్
- నిఘా కళ్లు కప్పి రవాణ





ఇటీవలే పోలీసులు పట్టుకున్న గంజాయి..

> డ్రగ్స్, ఇతర మారకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'ప్రహరీ క్లబ్'లు ఉన్నా లేనట్లుగానే మారింది. డ్రగ్స్‌కు బారిన పడి ఉజ్వల భవిష్యత్, జీవితాల్ని పాడు చేసుకుంటున్న విద్యార్థుల్లో అవగహనా పెంచాలనే ఉద్దేశంతో పాఠశాలలు, కళాశాలల్లో వేసిన ప్రహరీ క్లబ్‌ల ఉలుకేలేదు. ఇప్పటికీ అనేక విద్యా సంస్థల్ని అడ్డాగా చేసుకుని గంజాయి, ఇతర డ్రగ్స్‌ను విద్యార్థులకు అంటగడుతున్న పరిస్థితులున్నాయి. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్యా సంస్థల్లో గట్టి నిఘా లేకపోవడం వల్ల డ్రగ్స్ నియంత్రణలో ఆశించిన ఫలితాలు కనిపించట్లేదు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లా ఇతర రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంగా ఉండడంతో గంజాయి, కొకెన్ వంటి ఇతర డ్రగ్స్ యదేచ్ఛగా చేతులు మారుతుంది. సరిహద్దు ప్రాంతాల నుంచి జోరుగా డ్రగ్స్ రవాణా అవుతున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర పరిసరాల తీసుకెళ్లడం, అక్కడి నుంచి ఇక్కడికి రవాణా చేయడం గుట్టుగా సాగుతుందనే విమర్శలున్నాయి. జాతీయ రహదారులపై తరచూ తనిఖీలు చేస్తున్నా గుట్టుగా దాటి పోతున్న సరుకు తక్కువేమీ కాదు. కొన్ని సార్లు పట్టిన సరుకు సైతం భారీగా ఉంటుంది. ఇప్పటికీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏదో ఒక చోట గంజాయి, ఇతర డ్రగ్స్ పట్టుపడుతునే ఉంది. పోలీసులకు పట్టుబడుతున్న సరకంతా కూడా సరిహద్దుల్ని దాటి పటణాలకు వచ్చిందే. ముఖ్యంగా జహీరాబాద్ మీదుగా ఎక్కువ మొత్తంగా రవాణా కాబడుతుంది. అలాగే సిద్దిపేట రహదారుల్లోనూ సరుకు రవాణా అవుతునే ఉందంటున్నారు.

విద్యా సంస్థల్లో పేరుకే ప్రహరీ క్లబ్‌లు

డ్రగ్స్ వల్ల జరిగే దుష్పరిమాణాల గురించి అవగహనా కల్పించడతో పాటు మారకద్రవ్యాలను నియంత్రించేందుకు ప్రాథమిక స్థాయిలో నిఘా పెంచాలని చూశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రహరీ క్లబ్‌ల్ని ఏరా ్పటు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 498 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు, 92 ఇం టర్, 18 డిగ్రీ, 17 ఐటీఐ కళాశాల లున్నాయి. సిద్దిపేట జిల్లాలో 230 ఉన్నత పాఠశాలలు, 102 ఇంటర్, 18 డిగ్రీ, 9 ఐటీఐ కళాశాలలున్నాయి. మెదక్ జిల్లాలో 168 పాఠశాలలు, 60 ఇంటర్, 13 డిగ్రీ, 5 ఐటీఐ కళాశాల లున్నాయి. వీటిల్లోకి డ్రగ్స్ రాకుండా చేయడమే కాకుండా విద్యా ర్థులకు అవగహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాలు చైర్మన్‌గా సీనియర్ ఉపాధ్యాయులు వైస్ చైర్మన్‌గా 6-10వ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఒకరు, పిల్లల తల్లిదండ్రుల నుంచి కమిటీ సభ్యులుగా క్లబ్‌ల్ని ఏర్పాటు చేశారు.

విద్యా సంస్థలే టార్గెట్

గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయించే వ్యక్తులు విద్యా సంస్థల్ని కేంద్రంగా చేసుకుని విద్యార్థుల్ని టార్గెట్‌గా డ్రగ్స్ దందా సాగిస్తున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో డజన్‌కు పైగా ఇంజనీరింగ్, మెడికల్ ఉన్నత విద్యా సంస్థలున్నాయి. ఇంటర్నేషన్ స్కూల్స్, ఐఐటీహెచ్, ఇంటర్, డిగ్రీ కళాశాలున్నాయి. వీటిల్లో చదివే విద్యార్థులకు డ్రగ్స్‌ను అలవాటు చేస్తున్నారు. ఆయా విద్యా సంస్థలున్న ఏరియాల్లో నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్ని అడ్డాలుగా చేసుకున్నారు. కిల్లీకొట్లు, కిరాణం దుకాణాల్లో డ్రగ్స్ విక్రయిస్తున్న దారుణానికి అడ్డుకట్ట పడట్లేదు. గోవాలు, ఇతర పాన్‌పరాక్ ప్యాకెట్ల మాటున గంజాయి, ఇతర డ్రగ్స్‌ను కూడా అంట గడుతున్నారు. విద్యా సంస్థల్లో వేసిన ప్రహరీ క్లబ్ కమిటీలు ప్రతి మూడు నెళ్లకు ఒకసారి సమావేశం జరపాలి. డ్రగ్స్‌ను అరికట్టేందుకు ఏలాంటి కార్యచరణ చేపట్టాలో చర్చించి కార్యక్రమాల్ని రూపొందించారు. విద్యార్థుల్లో అవగహన పెంచేందుకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహించారు. స్థానికంగా డ్రగ్స్ బారిన పడి జీవితాన్ని కోల్పోయిన యధార్థ గాథల్ని వివరించడం ద్వారా పిల్లల్లో చైతన్యం పెంచాలి. ఇలాంటి కార్యక్రమాల్లేవీ విద్యా సంస్థల్లో జరగట్లేదు.

సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, హాల్‌ను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-సిద్దిపేట

కొంతమంది సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన హాల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని వర్గాల వారు తమ కులానికి సరైన ప్రాధాన్యత లేదని బయట పోరాటం చేస్తున్నారన్నారు. అలాంటి కులాల వారి జనాభా తెలవాలంటే సర్వేలో పాల్గొనాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు సర్వే ఏమైందని ప్రతి రోజూ ధర్నాలు చేసే వారని, ఇప్పుడు మీ కుల సంఘాలను చైతన్య వంతం చేయాలని, అందరూ సర్వేలో పాల్గొనాలని కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొంటున్నారని, తెలంగాణ సమాజం భవిష్యత్ ప్రణాళికలు తయారు చేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఎన్యుమరేటర్లకు వివరాలు ఇవ్వాలని, ఎక్కడ ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. ఎక్కడ ఎలాంటి పథకం పోదని, కొత్త పథకాలు వస్తాయన్నారు. గ్రంథాలయ వ్యవస్థాపక అధిపతి రంగనాథ్‌కి నివాళులు అర్పించామని, గ్రంథాలయ వారోత్సవాలు, సహకార వారోత్సవాలు జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రంథాలయాలు ఎలా జ్ఞానాన్ని ఇస్తాయి, పుస్తకం ఈ సమాజంలో మనల్ని ఎంత చైతన్యాన్ని చేస్తాయనడానికి గ్రంథాలయలు నిదర్శనమని అన్నారు. పోటీ పరీక్షల్లో గ్రంథాలయాలు నిరుద్యోగుల విద్యార్థులకు ప్రిపేర్ కావడానికి వేదికగా ఉపయోగపడతాయని, సిద్దిపేట గ్రంథాలయంలో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. గ్రూప్-3 ఎగ్జామ్ సమయంలో ఇక్కడ మైక్ పెట్టే సమావేశాలు పెట్టాల్సింది కాదని, గ్రూప్-1లో 563 ఉద్యోగాలకు సంబంధించి చివరి దశకు వచ్చిందన్నారు. 11 నెలల కాలంలో సమస్యలు అధిగమించి 45 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. నేర్చుకున్న జ్ఞానం ఎక్కడికి పోదని, చదవడం అందరికీ నేర్పించాలన్నారు. సోషల్ మీడియా, టీవీల పేరుతో కలక్షేపంతో సమయాన్ని వృదా చేయవద్దన్నారు. లైబ్రరీలకు తెలంగాణ ప్రభుత్వం రియాజ్ ఉద్యమకారుడిని రాష్ట్ర స్థాయి చైర్మన్‌గా చేసిందని, జిల్లా చైర్మన్‌గా లింగమూర్తికి అవకాశం ఇచ్చిందన్నారు.

నెహ్రూ ఐఐటి, ఎయిమ్స్ పెట్టకపోతే ఈ రోజు భారత దేశం ఇలా ఉండకపోయేదన్నారు. పంచవర్ష ప్రణాళికలు, హరిత విప్లవం, ప్రాజెక్టులు నిర్మాణం, విద్యాలయాలు , వైద్యాలయాలు నిర్మాణం చేపట్టి దేశ అభివృద్ధిలో పునాదులు వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా.రియాజ్, సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, నాయకులు సూర్య వర్మ అత్తు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాల ఆరాటం

మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-కొండపాక



ప్రభుత్వము రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్ల వద్ద పెడితే అందుకు సంబంధించిన డబ్బు మిల్లర్లు చెల్లించలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇలా రాష్ట్రంలో రూ.20 వేల కోట్లు వారి వద్ద ఉన్నాయన్నారు. మండలంలోని దుద్దెడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అనంతరం మంత్రి పొన్నం పప్రభాకర్ మాట్లాడుతూ సిద్దిపేటలో సైతం 20 మంది రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి డబ్బు చెల్లించకుండా ఉన్నారని, వారు వెంటనే ప్రభుత్వానికి డబ్బు చెల్లించి ధాన్యం కొనుగోలులో పాల్గొనాలని రైస్ మిల్లర్లకు సూచించారు. రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు ఆరాటపడుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఎక్కడైనా ఇబ్బంది ఏర్పడితే సంబంధిత అధికారులకు తెలిపాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి కోసం ఆరాటపడుతున్నాయన్నారు. పంటలు ఆలస్యం కావడంతో కొనుగోలు కూడా ఆలస్యం అయ్యాయని ఎలాంటి సమస్యలు లేవన్నారు. రైస్ మిల్లర్లతో మాట్లాడి ధాన్యం కొనుగోలుపై చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలుకు ఎవరైనా అడ్డం పడితే చట్టరీత్యా చర్యలు తప్పమన్నారు. కాళేశ్వరం నీరు లేకున్నా పంటలు వచ్చాయన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో డబ్బులు పడతాయన్నారు.

సర్వేపై. అపోహలు వద్దు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక రాజకీయ కుల గణన కార్యక్రమంపై ఎలాంటి అపోహలు వద్దని ఇది దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలో శుక్రవారం నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. పంజాల కవిత ఇంట్లో ఎన్యుమరేటర్ నిర్వహిస్తున్న సర్వేను కుటుంబ సభ్యులతో పాటు కూర్చుని వివరాల నమోదును పరిశీలించారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అందరూ సహకరించాలన్నారు. మంత్రి వెంట అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, మార్కెటింగ్ అధికారి నాగరాజు, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ డిఇఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసిల్దార్ దిలీప్ నాయక్ ఎంఈఓ శ్రీనివాసరెడ్డి,మాజీ సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,లింగారావు,బొమ్మల యాదగిరి కలీముద్దీన్ తదితరులున్నారు..

పత్తి మిల్లుల తూకంలో తేడా వస్తుందంటూ రైతుల ఆందోళన



నవతెలంగాణ-చేర్యాల

పత్తిని అమ్ముకునేందుకు తెస్తే తూకంలో తేడాలు వస్తున్నాయంటూ చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ శివారులోని మహేశ్వరి కాటన్ ఇండస్ట్రీస్ వద్ద పలువురు రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వివిధ రకాలుగా తూకంలో తేడాలు వచ్చాయని, గత కొన్ని రోజులుగా మిల్లులో ఇదేవిధంగా జరుగుతుందని దీంతో పలువురు రైతులు నష్టపోయారని ఆరోపించారు. ముస్త్యాల గ్రామానికి చెందిన బండారు సతీష్, ఆకునూరు శేఖర్‌లు మిల్లుకు తీసుకుపోయిన పత్తి తూకంలో తేడా రావడంతో వారికి తోడుగా ఇతర ప్రాంతాల రైతులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, కాటన్ పర్చేసింగ్ అధికారి అమిత్ పాటిల్‌తో పాటు పలువురు పత్తి మిల్లును సందర్శించి రైతులతో మాట్లాడి తూకం వేసే యంత్రాన్ని, తదితర వాటిని పరిశీలించారు. అనంతరం డీఎంఓ విలేకరులతో మాట్లాడుతూ సాంకేతిక కారణాలవల్ల తూకంలో తేడా వచ్చిందని రెండు రోజులపాటు ఈ మిల్లులో పత్తి కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు న్యాయం చేయనివారు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్



నవతెలంగాణ-సిద్దిపేట

విద్యార్థులకు న్యాయం చేయని రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ సిద్దిపేట్ డివిజన కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను విడుదల చేయాలని మంత్రికి వినతి పత్రం ఇవ్వగా, ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని, ఇప్పట్లో పెండింగ్ స్కాలర్షిప్లు విడుదల చేయమంటూ మంత్రి విద్యార్థి నాయకులకు వెటకారంగా తేలిగ్గా సమాధానం చెప్పారని మండిపడ్డారు. ఒక మంత్రి హెూదాలో ఉండి, విద్యార్థి సంఘంలో పనిచేసిన నాయకుడు పొన్నం ప్రభాకర్ ఇలా మాట్లాడడం సరికాదని మండిపడ్డారు. తక్షణమే స్కాలర్షిప్‌లు విడుదల చేయకుంటే జిల్లాలలో పొన్నం ప్రభాకర్ పర్యటనలను ఎక్కడకక్కడ డివిజన్ వారిగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఫిలిప్పీన్స్‌లో పటాన్‌చెరు యువతీ అనుమానాస్పద మృతి

- మృతదేహాన్ని త్వరగా తెప్పించాలంటూ ప్రభుత్వాలకు మృతురాలి తల్లిదండ్రుల వేడుకోలు
- వైద్య విద్యార్థి మృతితో ఇంద్రేశంలో విషాదఛాయలు







నవతెలంగాణ-పటాన్‌చెరు

వైద్యవృత్తిని అభ్యసించేందుకు ఫిలిప్పీన్స్ దేశం వెళ్లిన ఓ విద్యార్థిని.. పుట్టిన రోజునే తన గదిలో అనుమానాస్పదంగా మృతి చెందింది. శుభాకాంక్షలు తెలపడానికి స్నేహితులు వెళ్లగా.. ఆమె విగతజీవిగా ఉండటాన్ని గమనించారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామంలో నివాసముంటున్న విద్యుత్ శాఖ డీఈ చింత అమృతరావు ఒక్కగానొక్క కుమార్తె స్నిగ్ధ (21) ఫిలిప్పీన్స్ దేశంలోని పెర్పెక్చువల్ హెల్ప్ యూనివర్సిటీ మనీలాలో వైద్య వృత్తిని అభ్యసించేందుకు 2021 సెప్టెంబర్‌లో వెళ్లింది. ప్రస్తుతం 3వ సంవత్సరం చదువుతున్నది. గత మార్చిలో స్వగృహానికి వచ్చి ఏప్రిల్‌లో తిరిగి ఫిలిప్పీన్స్ వెళ్లింది. కాగా చింత స్నిగ్ధ పుట్టినరోజు సందర్భంగా ఆమె స్నేహితులు ఫిలిప్పీన్స్ కాలమానం ప్రకారం గురువారం రాత్రి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు స్నిగ్ధ గదికి వెళ్లారు. ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించింది. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతి చెందిన సమాచారం తెలిసినప్పటి నుంచి ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమ కూతురు మృతదేహాన్ని త్వరితగతిన తెప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఫిలిప్పీన్స్ అధికారులతో సంప్రదించాలని వేడుకుంటున్నారు. ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కొరకు విదేశాలకు వెళ్లి పుట్టిన రోజే మృతి చెందడంతో ఆమె కుటుంబంలో, గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి

నవతెలంగాణ
సంగారెడ్డి
2
శనివారం | 16 నవంబర్ 2024 | www.navatelangana.com

కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నదానం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కార్తీక పౌర్ణమి సందర్భంగా బొల్లారం మున్సిపాల్టీలోని మల్లన్న ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువజన నాయకుడు వి.ప్రవీణ్‌రెడ్డి అన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నదాన వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పవిత్ర కార్తీక పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖః సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పెద్ద ఎత్తున మహిళా భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మోహన్ రెడ్డి, రవితేజ, ఆలయ అర్చకులు రవి, స్థానికులు చంద్ర, మోహన్, రాజు, సాగర్, దుర్గభవాని, ప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పటాన్‌చెరులో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి నాయకులు బాల్‌రెడ్డి, అంజయ్యలు మొక్క ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐబీ బంగ్లా ముందు ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కంది జైలులో ఉన్న లగచర్ల గ్రామ రైతులను పరామర్శించి, ధైర్యం చెప్పడానికి వెళ్తున్నట్లు పార్టీ శ్రేణులతో కేటీఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, వెంకటేశం గౌడ్, సోమీ రెడ్డి, రాములు గౌడ్, శ్రీధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

- వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి

గిరిజన సమాజ అభివృద్ధికి కృషి చేయాలని.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పథకాలను అమలు పరచాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ధర్తీ ఆబ భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సంద ర్భంగా గిరిజన గౌరవ దినోత్సన్ని శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై.. జ్యోతి ప్రజ్వలన చేసి, గిరిజనుల సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ.. గిరిజన సమాజానికి ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు ధర్తీ ఆబ భగవాన్ బిర్సా ముండా చేసిన అచంచల కృషి గిరిజనుల కోసం గర్వించదగ్గ చరిత్రగా నిలిచిందన్నారు. తన 25 ఏళ్ల చిన్న వయసులోనే భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎనలేని ప్రభావం చూ పారన్నారు. అంతేకాకుండా, తన నాయకత్వంలో సాగిన ఉల్గులాన్ ఉద్యమం గిరిజనులకు స్వీయ ఆత్మగౌరవాన్ని చాటింది. ఈ ఉద్యమం భూమి, అడవులపై గిరిజనుల హక్కులను రక్షించడమే కాకుండా, వలస పాలకుల అక్రమ దోపి డీకి వ్యతిరేకంగా లేచిన గొప్ప ఉద్యమంగా గుర్తించబడింద న్నారు. గిరిజనులకు ఎటువంటి హక్కులు లేని రోజుల్లో వారి కి న్యాయబద్ధమైన హక్కులను అందించి, సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. గిరిజన ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు దర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి, తాగునీరు, వైద్య సౌకర్యంతో పాటు నాణ్యమైన విద్యను అందిం చేం దుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల జీవనో పాధికి సహాయపడేందుకు స్వయం సహాయక సంఘాలు, ఉపాధి హామీ పథకాలను బలోపేతం చేయాలన్నారు. గిరిజ నుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. గిరిజనులు సాధి, కారత సాధించేందుకు ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలను వారికి అందించాలన్నారు. గిరిజన పిల్లలకు బడులు, వసతి గృహాలు అందించడంతో పాటు, బోధనాభ్యాసాన్ని మెరుగు పరచడం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిం దన్నారు. బిర్సా ముండా వంటి మహా నాయకుల జీవితాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో అదనపుకలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమా ధికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంఘాల నాయకులు తది తరులు పాల్గొన్నారు.





సర్వేతో సమగ్ర అభివృద్ధి

నవతెలంగాణ-కంగ్టి

ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న సర్వేతో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. మండలంలోని తుర్క వడగామాలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్య, వైద్య, రాజకీయ, సామాజిక ఆర్థిక అభివృద్ధి ఇతర అంశాలపై నిర్వహిస్తున్న ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రగతి ప్రణాళిక రూపాకల్పన కోసం జరుగుతున్న సర్వే వివరాలు.. డాటా ఎంట్రీ పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



సకల జనులు సుభిక్షంగా ఉండాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

సకల జనులు సుభిక్షంగా ఉండాలని నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ శ్రీశైలం క్షేత్రంలోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నట్టు తెలిపారు.



చెరువుల్లో చేప పిల్లల వితరణ

నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ గ్రామంలోని నాయిని చెరువు, కోమటి చెరువులో 60 వేల చేప పిల్లలు, పోసానిపల్లి గ్రామంలోని చెరువులో 30 వేలు మొత్తంగా 90 వేల చేపపిల్లలను ఫిషర్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీశైలం, కనకయ్య శుక్రవారం చెరువుల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు గారెల నర్సింలు, మత్స్యశాఖ నాయకులు పాల్గొన్నారు.

సర్వేలో వ్యక్తిగత వివరాలు సేకరించొద్దు



నవతెలంగాణ-సదాశివపేట

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించడం తగదని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ విమర్శించారు. దేశ జనాభా లెక్కల్లో కులగణన చేర్చా లనే చర్చ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నదన్నారు. ఈ సర్వే పత్రంలో కులంతోపాటు ఆస్తులు, రాజకీయ, వ్యవసాయ భూములకు సంబం ధించిన వ్యక్తిగత వివరాలతో కూడిన ప్రశ్నలున్నాయని వివరిం చారు. ఆ వివరాలు ఇవ్వడానికి పలు అనుమానాలు, వ్యతిరేకత ప్రజల్లో వ్యక్తమవుతున్నాయన్నారు. అటువంటి ప్రశ్నలను మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ప్రశ్నలకు సంబంధించిన వివరాలు వెల్లడిరచడానికి ప్రజలు విముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. కొన్ని చోట్ల ఎదురు తిరుగుతున్నట్టు, దాడులు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డులు తొలగించడానికి, సంక్షేమ పథకాలు రద్దు చేయడానికే ఈ సర్వే చేస్తున్నారంటూ ప్రజల్లో సందేహాలు రేకెత్తుతున్నాయన్నారు. కొన్ని చోట్ల సర్వే చేస్తున్న వారిని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లను అనుమానించే సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అందువల్ల పై అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు.



కేతకిలో కార్తీక పౌర్ణమి సందడి

నవతెలంగాణ-ఝరాసంగం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆలయంలో పలు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు కర్నాటక, మహారాష్ట్రల చెందిన భక్తులు భారీగా దైవదర్శనానికి తరలి వచ్చారు. ముందుగా అమృతగుండంలో భక్తులు పుణ్య స్థానాలు ఆచరించి దైవ దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు అధికంగా రావడంతో ఆలయ అధికారులు క్యూ పద్ధతిన దర్శనం గావించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.కాగా కార్తీక పౌర్ణిమ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో స్వామి కళ్యాణోత్సవం కనుల పండుగగా కొనసాగింది. వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు భక్తజన సందోహం మధ్య కళ్యాణాని అంగరంగ వైభవ ంగా నిర్వహించారు.అలాగే అమృతగుండంలో దీపారాధన, గంగ హారతి కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు.ఇంకా పలు కార్యక్రమాలు ఘనంగా కొనసాగగా వేలాది మంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలకు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-చౌటకూర్

మండలంలోని కోర్పోల్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అరబెట్టి.. తాలు పట్టిన వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. సన్నాలను కూడా త్వరగా తీసుకోవా లన్నారు. ఇప్పటి వరకు చౌటకూర్ మండలంలో ఎన్ని టన్నుల వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారని సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. డీసీఎంఎస్ సూపర్వైజర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. 32 టన్నుల ధాన్యాన్ని తరలించినట్టు తెలిపారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి కుటుంబ సర్వే వివరాల రికార్డును పరిశీలిం చారు. అక్కడి నుండి మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసిల్దార్ కిరణ్, పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ, ఎంపీవో శ్రీకాంత్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది,గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక, ప్రాథమికోన్నత టీచర్లందరికీ ఓటుహక్కు కల్పించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత టీచర్లందరికీ ఓటు హక్కు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యయులందరికి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక కులగనన కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌జిటి ఉపాధ్యాయుల సమస్యలను పరిశీలించి ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న సూచనలను పరిగణించాలన్నారు. ప్రభుత్వాలు మారినా, ప్రభుత్వ విధానాలు మారడం లేదన్నారు. కులాల, మతాలకతీతంగా గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. కులానికి, మతానికి ఒక్క గురుకులం ఏర్పాటు చేయడం కుల, మత రహిత సమాజం ఏర్పడడం అసాధ్యమన్నారు. అనంతరం ముత్యాల రవీందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, మౌలిక, కులగణన కార్యక్రమం ప్రజలు అందుబాటులో ఉన్న సమయం ఉదయం పూట సర్వే నిర్వహించి, మధ్యాహ్నం నుండి బడులు నడిపించాలన్నారు. ఏరోజుకు ఆరోజు సర్వే ఫారాలు ఇవ్వడం, ఒక రోజు ఇన్ని ఫారాలు నింపాలనడం ఉపాధ్యాయుల మీద ఒత్తిడి పెరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించాలని, పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగారం శ్రీనివాస్, అనుముల రాంచందర్ మాట్లాడుతూ.. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అంగీకరించడం పట్ల హర్ష వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జెఏసీ చైర్మన్‌గా సమర్థవంతంగా పని చేసి గొప్ప ఉద్యమ కారుడు, నిజాయితీకి నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన నాయకుడిగా పేరుగాంచిన వై.అశోక్ కుమార్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, రాజారెడ్డి, నాగేశ్వర్ రావు, సునీతా ఖన్న, సుభాష్ బాబు, భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, నాజర్ పటేల్, బిచయ్య, ప్రశాంతి, జిల్లా కార్యదర్శులు మల్లికార్జున్, అశోక్ కుమార్, నర్సింలు, భవాని, బాబూరావు వివిధ మండలాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు,కౌన్సిలర్లు హాజరయ్యారు.

జిన్నారంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-జిన్నారం

మండలంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలను శుక్రవారం కన్నుల పండుగ్గా నిర్వహించారు. మండల కేంద్రమైన జిన్నారంలో గల కోదండ రామాలయం, హనుమాన్ దేవాలయం, జీవన జ్యోతిర్లింగ శివాలయంతో పాటుగా ఆయా గ్రామాల్లో గల ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు సామూహికంగా చేపట్టారు. కార్తీకదీపం ఆరాధన కార్యక్రమాలను మహిళలు పెద్దసంఖ్యలో నిర్వహించారు. మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో సత్యనారాయణ వ్రతాలతో పాటు కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఉమ్మడిగా చేపట్టారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నేపథ్యంలో ప్రత్యేకమైన అలంకరణతో పాటు కార్తీక పౌర్ణమి ప్రత్యేక దీపారాధన కార్యక్రమాలు చేపట్టారు. సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని కొడకంచి ఆదినారాయణ స్వామి ఆలయంతో పాటు ఆయా గ్రామాల్లో గల ఆలయాల్లో భక్తుల సందడి కార్తీక పౌర్ణమి సందర్భంగా పెరిగింది. బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయానికి జిన్నారం మండలంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు వీరభద్ర స్వామి దర్శనార్థం తరలివెళ్లారు. ప్రధానంగా కుటుంబ సమే తంగా కార్తీక పౌర్ణమి వేడుకలను ఆయా ప్రాంతాల్లో సంప్రదాయ భగ్గంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఆ యా గ్రాముల నాయకులు, పాల్గొన్నారు. ఊట్ల గ్రామంలో చేపట్టిన కార్యక్రమంలో గోవింద్ కులకర్ణి, మాజీ సర్పంచ్ లు జింకలశివరాజ్, కొరివి ఆంజనేయులు, ఆధ్యాత్మికవేత్త జహంగీర్ రెడ్డి, నందకుమార్, రమేష్, రాములు, కృష్ణ, ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ కన్వీనర్ యాదగిరి, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



నేటి 'మాలల ఆత్మీయ సమ్మేళనం' జయప్రదం చేయండి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో నేడు(శనివారం) జరిగేమాలల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ బక్కన్న, మాలమహానాడు అధ్యక్షుడు ఏ.మల్లేశం శుక్రవారం పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యేగా వి.ఆర్. నాగరాజు, మల్లేపల్లి లక్ష్మీ, ఎంఎస్ గోపీనాథ్, మామిడి నారాయణ, మందాల భాస్కర్, లక్ష్మీనారాయణ, సర్వయ్య, రేంజర్ల రాజేష్ ఆల్ ఇండియా సమత సైనికులు దిగంబర్ కామ్లేలు హాజరవుతారన్నారు. మాలలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దర్శన్, డాక్టర్ బి జనార్ధన్, అనంతయ్య, మొగులయ్య, నాగయ్య, దుర్గాప్రసాద్, రత్నాకర్ వీణ బాంధవ్, లక్ష్మయ్య దాసరి దుర్గయ్య, గంటా సురేష్, రవీందర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో బహుముఖ సవాళ్లు



నవతెలంగాణ-పటాన్‌చెరు

వాతావరణ మార్పుల వల్ల మనం బహుముఖ సవాళ్లను ఎదుర్కొంటున్నామని, మానవ కార్యకలాపాలు, వాతావరణ మార్పుల మధ్య సంక్లిష్టమైన పరస్పర చర్యను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని స్కాట్‌లాండ్‌లోని ఎడిన్ బర్గ్ విశ్వవిద్యాలయం పర్యావరణ, వాతావరణ న్యాయ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ రంజన్ హితవు పలికారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో 'చిక్కుబడ్డ సంక్షోభం: హిమాలయాల్లో పర్యావరణ విధ్వంసం, న్యాయం' అనే అంశంపై శుక్రవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. వాతావరణ మార్పు, విపత్తుల సాంద్రత, తీవ్రతపై, ముఖ్యంగా ఉత్తరాఖండ్ ప్రాంతంలో సంభవిస్తున్న పరిణామాలపై ఆయన దృష్టి సారించారు. దీనికి గల సాంకేతిక పరిష్కారాలను పదే పదే ప్రస్తావిస్తూనే, ఈ సంక్షోభాల భావోద్వేగ, మానవ కోణాలను విస్మరించడాన్ని తప్పుబట్టారు.డాక్టర్ రంజన్ తన వినూత్న పరిశోధన ద్వారా హిమాలయ ప్రాంతంలో వాతావరణ వైపరీత్యాల లోతైన చిక్కులను అర్థం చేసుకోవడానికి శోకంని ఒక ముఖ్యమైన అంశంగా పరిచయం చేశారు. వాతావరణ సంక్షోభం చుట్టూ మన కథనాలను రూపొందించడంలో మానవ బాధలను గుర్తించడం, ధృవీకరించడం చాలా అవసరమని వాదించారు. వాతావరణ మార్పు ప్రభావిత కమ్యూనిటీలపై తీసుకునే భావోద్వేగ నష్టాన్ని బహిరంగంగా గుర్తించాలని సూచించారు. ఈ చర్చలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని వాతావరణ విపత్తుల యొక్క మానవ కోణాలను అన్వేషించడానికి, వాతావరణ సంభాషణలో భావోద్వేగ కథనాలను ఏకీకృతం చేయాల్సిన ఆవశ్యకత గురించి తెలుసుకున్నారు.

విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

పాఠశాలలకు వెళ్లే పేద విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని మంబాపూర్ గ్రామ ప్రజలు కోరారు. మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి వరకే ఉండడంతో పై చదువుల కోసం గుమ్మడిదలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పిల్లలు వెళ్తుంటారు. అయితే వారికి రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంబాపూర్ గ్రామం నుంచి గుమ్మడిదల ఉన్నత పాఠశాల వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర దూరం ఉంటుందని.. మండల జిల్లా ఉన్నతాధికారులు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాగా వెంటనే స్పందించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి స్పందిస్తూ.. తొందర్లోనే తన సొంత ఖర్చులతో పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులకు ఆటోలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ దయానంద్, నాయకులు బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు చాలి ప్రకాష్ ,దయానంద్ ,లక్ష్మణ్, రాజు, నాగరాజు, సాయి, ఎల్లయ్య తదితరులున్నారు.



తల్లికొడుకుల హత్యా ఘటన దారుణం..

నవతెలంగాణ-గుమ్మడిదల

తల్లి కొడుకుల హత్య ఘటన చాలా దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి వీరభద్రనగర్ కాలనీలో గురువారం తల్లి కొడుకుల హత్య జరిగిన విషయం విధితమే. ఈ విషయం తెలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మెన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులను అతి దారుణంగా హతమార్చడం బాధాకరమన్నారు. మం డలంలో మును పెన్నడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. ఇలాంటి అమానుష ఘట నలు చోటు చేసుకోకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. అంత్రక్రియ ల ఖర్చు నిమిత్తం రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.



మాదారంలో రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని మాదారం గ్రామంలో శుక్రవారం ఆర్అండ్‌బి రోడ్డు పనులను అధికారులు గ్రామస్తులు చేపట్టారు. కంకర క్రషర్ల వల్ల భారీ వాహనాలు తిరగడంతో రోడ్లన్ని ధ్వంసం అయ్యాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. కంకర క్రషర్ల అసోసియేషన్‌కు తమ ఇబ్బందులను వివరించారు. మాదారం మాజీ సర్పంచ్ సరిత సురేందర్‌గౌడ్ స్థానిక ప్రజలతో కలిసి చాలా సార్లు రోడ్ల పరిస్థితి గురించి వివరించడంతో.. ఎట్టకేలకు పనులు ప్రారంభం అయ్యాయి. ఈ రోడ్డు మరమ్మతులుగాను కంకర క్రషర్ల అసోసియేషన్ రూ.15 లక్షల ప్రకటించినట్టు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం కొడకంచి బ్రిడ్జి నుంచి మాదారం మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు ప్యాచ్ వర్క్ సంబంధించి మరమత్తు పనులు కొనసాగుతున్నాయని మాధవరం వాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి డి.రామకృష్ణ, ఏఈ చంద్రశేఖర్ మాదారం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గణేష్, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్, నరసింహా గౌడ్,రామకృష్ణ గౌడ్, శంకర్,బలరాం ,పాండు యాదవ్, రాజు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
3
మెదక్
శనివారం | 16 నవంబర్ 2024 | www.navatelangana.com

సమగ్ర సర్వేలో వేగం పెంచాలి

- మర్కుక్ తహసీల్దారు ఆరిఫా



నవతెలంగాణ-మర్కుక్

సమగ్ర కుటుంబ సర్వే చేయడంలో ఎన్యూరేటర్లు వేగం పెంచాలని మండల నోడల్ అధికారి, తహసీల్దారు అరిఫా సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని శివారు వెంకటాపూర్ గ్రామంలో సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించి, అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మర్కుక్ మండలంలోని 16 గ్రామాలకుగాను 6749 కుటుంబాలలో 3419 సర్వే పూర్తయిందని, 50శాతం పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూరేటర్లు తమ్మ కుమార్, మధు, తదితరులున్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పూజలు



నవతెలంగాణ-సదాశివపేట

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సదాశివపేట మండల పరిధిలోని నందికంది గ్రామంలోని శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అర్చకులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

4వ వార్డులో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రజల సౌకర్యార్థం కొత్తగా నిర్మిస్తున్న సిసి రోడ్ పనులు, సీసీ రోడ్డు డ్యామేజ్ ప్యాచ్ పనులు చేపట్టామని తెలిపారు. ముదిరాజ్ సిసి రోడ్డు పనులు మరమత్తులను పరిశీలించి, కాంట్రాక్టర్‌కు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లు నాగులు, కాంట్రాక్టర్, వార్డు ప్రజలు, తదితరు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో మొదలైన గ్రూపు రాజకీయాలు



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలో బీఆర్ఎస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు మళ్లీ తెరకెక్కుతున్నాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గత ఐదారు నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, కాంటారెడ్డి, తిరుపతిరెడ్డి కలిసి పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పనిచేసేవారని ఇప్పుడు అవేమీ కనిపించడం లేదని ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా పార్టీ పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు . గతంలో కాంటారెడ్డి, తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో పని చేసినప్పుడు అప్పటి శ్రేణులు ఇప్పటికీ సన్నిహితంగా మర్యాదపూర్వకంగా మాట్లాడుతున్నారని నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్నది. దేవేందర్ రెడ్డి ఎలాంటి కార్యక్రమాలలో పాల్గొన్నప్పటికీ కార్యకర్తలు మాత్రం ఆయన వెంబడి కనిపించలేకపోతున్నారనే ప్రచారం ఉంది. నిజాంపేట మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు ఎవరికి వారు వచ్చి పోతూ బాధితులను పరామర్శిస్తున్నారని, కంటా రెడ్డి తిరుపతిరెడ్డి మాత్రం ఇప్పటికీ బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తూనే ఉన్నాడు. పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు ఎవరి వర్గంతో వారే వస్తున్నారని బహిరంగంగా చర్చ జరుగుతున్నది. విడువమంటే పాముకు కోపం, కరువుమంటే కప్పకు కోపమనే చందంగా తయారయింది. కాంటారెడ్డి తిరుపతిరెడ్డితో వెళ్లాలా? పద్మాదేవేందర్ రెడ్డితో వెళ్లాలా? అనే సందిగ్ధంలో (సంశయంలో) నిజాంపేట బీఆర్ఎస్ నాయకుల పరిస్థితి ఏర్పడిందని చెప్పొచ్చు. మొదటి నుంచి పార్టీ పెద్దలకు విధేయుడుగా పనిచేసిన వారికి గుర్తింపు లేదని షేర్ సుభాష్ రెడ్డి దగ్గరికి పోయి వచ్చిన వారికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు నాయకులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో రామాయంపేట నియోజకవర్గాన్ని తొలగించారని మళ్లీ రామాయంపేట నియోజకవర్గం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారని నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ఎలాగైనా టిక్కెట్ తనకే వస్తుందనే దీమాలో కాంటారెడ్డి తిరుపతిరెడ్డి తన వర్గాన్ని ఏర్పరచుకుంటున్నాడని ప్రచారం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికీ నిజాంపేట మండలంలో రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి.

జీపీపీ డిపోలో ప్రగతి చక్రం అవార్డ్స్ ప్రధానం





నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డ్స్ ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించామని మెదక్ రీజినల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. శుక్రవారం జీపీపి డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వివిధ కేటగిరి కండక్టర్, డ్రైవర్లు, మెకానిక్, ఏడీసీల శ్రమకు అవార్డులు అందజేశారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలను అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌ను లక్ష లక్ష్యం ఛాలెంజ్‌గా తీసుకున్న కండక్టర్, డ్రైవర్ల శ్రమను కొనియాడారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు లక్షే లక్ష్యం (రోజుకు లక్ష రూపాయల అదనపు ఆదాయం సంపాదించడంలో జీపీపి డిపో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో ముందంజలో తీసుకువచ్చిన సిబ్బంది సమిష్టి కృషిని అభినందించారు. ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించాలని, డ్రైవింగ్ చేసేటపుడు డ్రైవర్లు జాగ్రత్తగా లెఫ్ట్ లైన్ డ్రైవింగ్ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితిలో సిగ్నల్ జంప్ చేయడానికి అస్కారం ఇవ్వకుండా ఓపికతో నడపాలన్నారు. సిబ్బంది అందరికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా శబరిమల స్పెషల్ బుకింగ్ సంబంధించిన బ్రోచర్స్, పాంప్లెట్లను ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పావన్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ బాబు నాయక్, ఎంఎఫ్ జమీల్, డిపో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శాంతమ్మ గుడి వద్ద అన్నదానం



నవతెలంగాణ-రామాయంపేట

కార్తీక పౌర్ణమి సందర్భంగా రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మ బస్తీలో ఉన్న శాంతమ్మ గుడి వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్తీకి చెందిన పోచమ్మల చంద్రకళ, పోచయ్యలు అన్నదాన కార్యక్రమాన్ని చేపటగా స్థానిక కౌన్సిలర్ దేవుని జయ రాజు, బాసం గంగాధర్, పుట్టి నర్సింలు, బసన్న పల్లి మల్లేశం, పోచమ్మల మహేష్‌లు సహకరించినట్లుగా వారు తెలిపారు. రామాయంపేట పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే మహిళలు, పిల్లలు, పెద్దలు తమ గృహాలలో తులసి ఉసిరి చెట్లకు ప్రత్యేకంగా పలు రకాల పూలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పేట మండల పరిధిలోని కొప్పల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో, పేటలోని శివాలయం, విట్టలేశ్వర, మాణిక్ ప్రభు తదితర దేవాలయాలలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. బూర్గుపల్లిలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సంగమేశ్వర గుట్టకు అన్న ప్రసాదం నిర్వహించారు. ఆయా గ్రామాలలో సైతం దేవాలయాల్లో గృహాలలో మహిళలు దీపాలు వెలిగించి కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా కృష్ణమూర్తి

- రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తిని మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్ శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా మహంకాళి కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మెదక్ జిల్లా చైతన్య వేదిక అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు వీర మోహన్, పద్మశాలి మెదక్ జిల్లా సంఘం అధ్యక్షులు జయ రాములు గుజ్జరి కనకరాజు లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పద్మశాలి కులస్తులు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి చైతన్య వేదిక ద్వారా తీసుకెళ్తానని అన్నారు.

అయ్యప్ప దీక్ష మాల ధారణ



నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

పెద్ద శంకరంపేటలోని వేణుగోపాల స్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం గురు స్వామి రామచంద్ర చారి పలువురు స్వాములకు అయ్యప్ప మాల ధారణ వేశారు. 41 రోజుల కఠిన దీక్ష అనంతరం శబరిమలై తరలి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారని వివరించారు. అయ్యప్ప దీక్ష ధరించడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఎన్నో విధాలుగా లాభం చేకూరుతుందని గురుస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వాములు టి రవీందర్ నరేష్ తదితరులు మాలాధారణ ధరించారు.

బహుమతి అందుకున్న విద్యార్థి అర్పిత



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక కథల పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హవెలిఘనపూర్‌లో చదువుతున్న ఎనిమిదవ తరగతి విద్యార్థిని అర్పిత బహుమతి అందుకున్నారు. తెలుగు కథల పోటీలలో రాష్ట్రస్థాయి ఉత్తమ కథగా నగదు బహుమతిని, పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాదులో ముఖ్య అతిథులుగా కెవి రమణ, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, వరప్రసాదరెడ్డి, గరిపల్లి అశోక్, జుర్రుచెన్నయ్య బహుమతులను అందజేశారు. అర్పిత రాష్ట్రస్థాయి పురస్కారం అందుకోవడం పట్ల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో బాల కవులుగా పలు రాష్ట్రస్థాయి అవార్డులు అందుకోవడం పట్ల తెలుగు ఉపాధ్యాయులు నల్ల అశోక్, ఉండ్రాళ్ళ రాజేశం, ఎల్లమ్మలను అభినందించారు.

సేవా రత్న నేషనల్ అవార్డు అందుకున్న ఇంతియాజ్ మీర్జా



నవతెలంగాణ-చిలిపిచెడ్

మండల పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన ఇంతియాజ్ మీర్జా సేవరత్న నేషనల్ అవార్డును శుక్రవారం అందుకున్నారు. ఇంతియాజ్ సేవలను గుర్తించి భారతీయ స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో హానర్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ జాతీయ సేవరత్న అవార్డును ఆర్టీసీ క్రాస్ రోడ్ కళాభారతిలో ఆకుల రమేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మీర్జా మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తనకు జాతీయ సేవా రత్న అవార్డు గ్రహీతగా గుర్తింపు చేసిన పూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో హానర్ సంస్థ చైర్మన్ ఆకుల రమేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన జీవితం నిరంతరం సేవకు కృషి చేస్తానని, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానన్నారు. సేవరత్న ఎంపికతో మండలానికి పేరు వచ్చిందన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న జిల్లా జడ్జి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండలం తాళ్ళపల్లిలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర కుటుంబసమేతంగా పాల్గొని అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ... సమానత్వ సమాజ నిర్మాణమే బౌద్ధం



- బుద్ధిస్ట్ సొసైటి ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి శీలం ప్రభాకర్

నవతెలంగాణ-సిద్దిపేట

సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం హేతుబద్ధమైన సత్యాన్ని ప్రబోధించే విలువలు గల సమసమాజం ఏర్పడాలంటే గౌతమ బుద్ధుడు సూచించిన బౌద్ధం ద్వారానే సాధ్యమవుతుందని బుద్దిస్ట్ సొసైటి ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి శీలం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భారత బౌద్ధ మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం అనేది శాస్త్రానికి మార్పునకనుగుణంగా ఉండాలన్నారు. నీతిని ప్రభోదించేదిగా ఉండాలని, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మానవీయ విలువలు కలిగినదిగా ఉండాలన్నారు. బుద్ధుడు మార్గదర్శకాలు మాత్రం మార్గదాతనే కానీ మోక్షదాతను కాదని, తాను ప్రబోధించింది గుడ్డిగా నమ్మకుండా పరీక్షించుకొని ఆచరించాలని ప్రబోధించారన్నారు. అనంతరం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎనగందుల శంకర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ గౌడ్, ఉప్పర పద్మ, రేణుక, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల నర్సింలు, కార్యదర్శులుగా వాగ్మారే సునీత, వేముల ప్రసన్న, కోశాధికారిగా మన్నె సాయి బాబా, కార్యవర్గ సభ్యులుగా మచ్చ గణేష్, సావుల రాజమౌళి, ఏలా కిషన్, పుట్ట రాజు, జంజిరపు ఎల్లేషలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటి ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శులు ఉప్పర మల్లేశం, కర్రే లక్ష్మీ తులసి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేందర్, గడ్డం మోహన్ రెడ్డి, దొడ్డి నాగరాజు, తదిరులు పాల్గొన్నారు.

వివాహానికి పుస్తె మట్టెలు అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మహమ్మద్ రషీద్ సాహెబ్ కూతురు మహమ్మద్ జీహేదా వివాహానికి లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ పుస్తే మట్టేలను అందజేశారు. పెళ్లి కూతురుకు తల్లిదండ్రులు లేనందున వారి కుటుంబ పరిస్థితులు చెప్పగా వెంటనే స్పందించి వారి పెళ్లికి వాళ్ల సంప్రదాయానికి అనుకూలంగా పుస్తె మట్టెలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ సిద్ధ రాములు, రామావత్ రాజు, మాలవత్ బాబు, తాజా మాజీ కో ఆప్షన్ మెంబర్ గౌస్, మెడికల్ ఎల్లం, వెంకట్, సులేమాన్, దుర్గయ్య, నగేష్, దుర్గా చారి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 16 మేకలు మృత్యువాత




నవతెలంగాణ-కంగ్టి

కొట్టంలో ఉన్న మేకలపై వీధి కుక్కలు దాడి చేయడంతో 16 మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని దెగుల్వాడి గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి రాంచెందర్ రోజులాగే శుక్రవారం తన మేకలను కొట్టంలో తోలి బయటికి వెళ్ళాడు. గంటసేపులో తిరిగి ఇంటికి వచ్చి చూడగా వీధి కుక్కల దాడిలో పదహారు మేకలు మృత్యువాత పడి కనిపించాయి. సుమారు రెండు లక్షల విలువ చేసే మేకలు మృత్యువాత పడ్డాయని బాధితుడు వాపోతున్నాడు. వీధి కుక్కల బెడద ఎక్కువైందని.. మనుషు లపై, పశుసంపదపై దాడి చేస్తున్నాయని చెప్పినా అధికారులు పట్టించుకోలేదన్నారు. చివరికి నా మేకలను బలిగొని నా మేకలను చంపేసినయన్నారు. ప్రభుత్వం పంచనామా నిర్వహించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. ఇలాంటి సంఘటనలు జరగకుండా కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నాడు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ అన్యాయమే

- కొల్గూర్ మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతి స్వామి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

పదకొండు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల వారికి అన్యాయమే జరిగిందని గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతి స్వామి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. గడిచిన పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చిందన్నారు. బడికి పోయే పిల్లల నుంచి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కి నిరసనలు చేపడుతున్నారన్నారు. అమలు గాని హామీలను ఇచ్చి, కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి పేదల జీవితాలను చిన్నభిన్నం చేశారన్నారు. పదేళ్ల పాటు ఎలాంటి కష్టాలు లేకుండా మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతా సస్యశ్యామలంగా ఉండేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక 70 ఏళ్ల పాలన మళ్లీ ముందుకు తెచ్చిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు పచ్చాత్తాపం పడుతున్నారన్నారు. రాబోయే నాలుగేళ్లలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి పూర్వ వైభవాన్ని తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పురం ఆంజనేయులు, స్వామి గౌడ్, పురం అనిల్, పాల్గొన్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-వెల్దుర్తి

కార్తీక పౌర్ణమి శుభ సందర్భంగా ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మండల పరిధి బస్వాపూర్ పరిసరాల్లో స్వయంభుగా వెలసిన భ్రమరాంబ మల్లికార్జున సహిత దేవాలయంలో ప్రత్యేక పూజ సాయంకాల సమయంలో మహిళలు దీపోత్సవాలు నిర్వహించారు. మాసాయి పేట్ మండల కేంద్రంలో షిరిడి సాయిబాబా, రుక్మిణి పాండురంగ దేవాలయంలో దీపారాధన అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామంలో రాజరాజేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజ కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి వారి వారి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవార్లకు ఒడిబియ్యాలు సమర్పించుకున్నారు. అనంతరం సంధ్యాకాల సమయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పత్తి మిల్లుల తూకంలో తేడా వస్తుందంటూ రైతుల ఆందోళన



నవతెలంగాణ-చేర్యాల

పత్తిని అమ్ముకునేందుకు తెస్తే తూకంలో తేడాలు వస్తున్నాయంటూ చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ శివారులోని మహేశ్వరి కాటన్ ఇండస్ట్రీస్ వద్ద పలువురు రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వివిధ రకాలుగా తూకంలో తేడాలు వచ్చాయని, గత కొన్ని రోజులుగా మిల్లులో ఇదేవిధంగా జరుగుతుందని దీంతో పలువురు రైతులు నష్టపోయారని ఆరోపించారు. ముస్త్యాల గ్రామానికి చెందిన బండారు సతీష్, ఆకునూరు శేఖర్ మిల్లుకు తీసుకుపోయిన పత్తి తూకంలో తేడా రావడంతో వారికి తోడుగా ఇతర ప్రాంతాల రైతులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, కాటన్ పర్చేసింగ్ అధికారి అమిత్ పాటిల్‌తో పాటు పలువురు పత్తి మిల్లును సందర్శించి రైతులతో మాట్లాడి తూకం వేసే యంత్రాన్ని తదితర వాటిని పరిశీలించారు. అనంతరం డీఎంఓ విలేకరులతో మాట్లాడుతూ సాంకేతిక కారణాలవల్ల తూకంలో తేడా వచ్చిందని రెండు రోజులపాటు ఈ మిల్లులో పత్తి కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్తమ అవార్డుల ప్రధానం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ డిపోలో విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులను శుక్రవారం డిపో మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అందించారు. ఈ పీకే, బీఈ ఎస్ టీ, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్ కండక్టర్లకు నగదు బహుమతులను అందజేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఇదేవిధంగా కష్టపడి హుస్నాబాద్ డిపోను లాభాలలో తీసుకురావాలని కోరారు. ప్రజలకు రవాణా రంగంలో నిత్యం సేవలు అందించాలని ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ శ్రీధర్, ట్రాఫిక్ సూపర్వైజర్ మురళీ, మెకానికల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అకౌంట్ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే మండలం అభివృద్ధికి ఆమడ దూరం

- ప్రజా సమస్యలను గాలికొదిలిన పాలకులు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైనా నోచుకోని గురుకుల పాఠశాల
- సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

పేరుకే నారాయణరావుపేట మండలంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట గ్రామ 6వ మహాసభ పోచంపల్లి భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాల స్వామి, రాళ్లబండి శశిధర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల స్వామి మాట్లాడుతూ మండలంలోని ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన ప్రజలపై అనేక భారాలు పడుతున్నాయన్నారు. మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీ గుకుల పాఠశాల మంజూరు చేసింది. కానీ నేటికీ పక్క భవనం నిర్మాణం చెప్పట్టలేదన్నారు. పేరుకే మండల కేంద్రం తప్ప అభివృద్ధికి ఆమడ దూరం అన్నమాదిరిగా నారాయణరావుపేట ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా మండల అభివృద్ధికి ఎలాంటి నిధులను కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే ప్రజలు సహించరన్నారు. గత ప్రభుత్వాలకు చెప్పిన బుద్ధి వీరికి కూడా చెబుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఎర్రజెండా నీడలో ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. సీపీఐ(ఎం) మండలంలో అన్ని వర్గాల, తరగతుల, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల తదితర ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. మండల సమగ్ర అభివృద్ధి కోసం అనేక ఆందోళనలు, పోరాటాలు చేస్తుందన్నారు. డిసెంబర్ 1,2 తేదీలలో గజ్వేల్ పట్టణంలో జరిగే జిల్లా సీపీఐ(ఎం)మూడవ మహాసభల జయప్రదానికి ప్రజలు, శ్రేయోభిలాషులు ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శిని ఏకగ్రీవ ఎన్నికను నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజల సమస్యలు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మామిడాల కనకయ్య, శాఖ సభ్యులు మహంకాళి నర్సింలు, యాద రాయమల్లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు



నవతెలంగాణ-ములుగు

ఐదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో పని చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు అన్నారు. శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో అల్యాబాద్ గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధిని చూసి తట్టుకోలేని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతుందన్నారు. రానున్న ఐదేళ్లలో ప్రతి ఇంటికి ప్రభుత్వం ఇచ్చిన పథకాలను చూసి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టేలా రెచ్చగొడుతున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. త్వరలోనే గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్రాం రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్, యాదగిరి, భూపాల్ రెడ్డి, అంజనేయులు, నయిముద్దీన్, సంజీవులు, నరసింహులు గౌడ్, ప్రవీణ్ రెడ్డి, రాజు, చంద్రం, బాబు, మల్లేష్, శ్యాంసుందర్ రెడ్డి, ముత్యాలు గౌడ్, రవి, రాజు, మల్లారెడ్డి, గోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

నవతెలంగాణ-బెజ్జంకి

అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం హెచ్చరించారు. గ్యాస్ స్టౌవులు మరమ్మతులు చేస్తామని గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని మహిళలు అప్రమత్తంగా ఉండాల్సిన అవశ్యకత ఉందని పలువురు పేర్కొన్నారు.

18 నుంచి శతావధానం

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట హరిహరా రెసిడెన్సి సమీపంలోగల లలిత చంద్రమౌళీశ్వరక్షేత్రము ఆవరణలో ప్రముఖ శతావధాని ఆముదాల మురళిచే ఈ నెల 18 నుంచి మూడు రోజులపాటు శతావదానం ఉంటుందని ఆలయ వ్యవస్థాపకులు పండరి రాధాకృష్ణ తెలిపారు. లలిత చంద్రమౌళీశ్వర దేవస్థాన 14వ వార్షికోత్సవం సందర్భంగా శతవదానంతో పాటుగా, సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే లలితాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ, తూములూరి భ్రమరాంబిక, మల్లంపల్లి శిరీషలచే దార్మిక ప్రవచన కార్యక్రమాలు కూడా ఉందని తెలిపారు. ఈ మూడు రోజుల కార్యక్రమానికి కవులు, రచతలు, సాహితీ ప్రియులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమగ్ర ఇంటింటా సర్వే జరగాలి

- రాష్ట్ర ఎస్సి,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-మిరు దొడ్డి

అక్బరుపేట, భూంపల్లి మండలంలో శుక్రవారం భూంపల్లి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలు ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్ చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఎస్సి, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కులగణన సర్వే చేయాలన్నారు. జనాభా ఆధారంగా రిజర్వేషన్లు రావాలంటే కులగణన జరగాలన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటి సర్వేను చేసి న్యాయబద్ధంగా నివేదికను అందించాలని తెలిపారు. ప్రజలు ఈ సర్వేకు సహకరించాలని సూచించారు.

అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో కార్తీక మాసం పూజలు



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజ్ఞాపూర్‌లో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తజనం, గజ్వేల్ లోని శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అందరికి కార్తీక మాసం శుభాకాంక్షలు తెలిపారు. శివకేశవులకు ఇష్టమైన మాసం కార్తీక మాసం అని కార్తీకమాసంలో దైవారాధన శ్రేష్ఠమని, కార్తీకమాసంలో దీపారాధన వల్ల అంతా మంచి జరుగుతుందని, ప్రజల విశ్వాసమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ జగ్గయ్యగారి, శ్రీనివాస్, లయన్ నేతి శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

రామకోటి రామరాజు దంపతుల పూజలు



నవతెలంగాణ-జగదేవపూర్

మండలం పరిధిలోని జంగం రెడ్డి పల్లె గ్రామంలో గల శ్రీ సీతారాములకు కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా శుక్రవారం భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని పంట పొలాల మధ్య, ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ సీతారాముల ఆలయం బండపై వెలిశారు. కాబట్టి రాముని బండగా భక్తులు పిలుస్తున్నారన్నారు. కార్తీక పౌర్ణమి జాతర ఓ ప్రత్యేకమన్నారు. కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పు ఈ సీతారాములు అని తెలిపారు. అక్కడ ఉన్న గుండంలో భక్తులు స్నానం ఆచరించి రాముణ్ణి దర్శించుకోవడం ఓ అద్భుత గట్టం అన్నారు. శాశ్వతమైనది రామ నామం ఒక్కటేనన్నారు. ప్రతి ఒక్కరు రామకోటి లిఖించి తరించాలన్నారు

ప్రజా పోరాటాలను బలపరచండి

- సీపీఐ(ఎం) జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలి
- జిల్లా కమిటీ సభ్యులు నర్సయ్య



నవతెలంగాణ-కొండపాక

ప్రజా ఉద్యమాలు ఊపిరిగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న భారత కమ్యూనిస్టు పార్టీకి (మార్క్సిస్టు) సహాయ సహకారాలు అందించాలని జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య కోరారు. శుక్రవారం సీపీఐ(ఎం) పార్టీ మండల కమిటీ సమావేశం వెలికట్ట ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన ప్రజలపై అనేక భారాలు పడుతున్నాయన్నారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వెంటనే ధరలను తగ్గించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ పది సంవత్సరాల కాలంలో ప్రభుత్వ రంగాన్ని మొత్తం ధ్వంసం చేసిందన్నారు. దేశ సంపదలను కొల్లగొడుతుందని దేశంలో కుల, మతాల ప్రాతిపాదికన ప్రజలను విడదీస్తూ దేశ ఐక్యతను దెబ్బ తీస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికి సిద్దపడుతున్నారనాఓప్పురు. రాష్ట్రంలో పది నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. డిసెంబర్ ఒకటవ తేదీన గజ్వేల్‌లో జరిగే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మూడోజు కనకాచారి, తాటోజు రవీంద్ర చారి, జగపతి నాగరాజు, కొమురవెల్లి కనకయ్య కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల మహాసభను జయప్రదం చేయాలి



- కార్యదర్శి ఆలేటి యాదగిరి

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలో ఈనెల 19న జరిగే సీపీఐ(ఎం) మద్దూరు మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి కోరారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనునిత్యం పేద ప్రజల కోసం, కార్మికుల కోసం, రైతుల కోసం, కూలీల కోసం, విద్యార్థి, యువజనుల కోసం ఈ ప్రాంతంలో ఎర్రజెండా నాయకత్వంలో ప్రజల పక్షాన నిలబడి పోరాడింది సీపీఐ(ఎం) అని ఆయన అన్నారు. భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజల కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు పోరాటాలు నిర్వహించడం కోసం ఈ మహాసభలో కార్యాచరణ జరుగుతుందని ఆయన తెలిపారు. .ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ మహాసభను అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్ల రమేష్, ఇరుమల్ల రమేష్, పిట్టల నరేష్, ఆల్ల శ్రీకాంత్, ఇష్టమైన శంకర్, బోయిన జగన్, ఇటమైన మల్లేశం, పుల్లారి సురేష్, అల్ల కిష్టయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ వ్యక్తికి తమ భూమితో ఎలాంటి సంబంధం లేదు

- మహేందర్ గౌడ్



నవతెలంగాణ-దుబ్బాక

ఇటీవల తమ భూమికి సంబంధించిన దాంట్లో నుంచి కొంత భాగాన్ని ఇతరులు కబ్జా చేశారని ప్రెస్ మీట్ నిర్వహించిన ఆ వ్యక్తికి తమ భూమితో ఎలాంటి సంబంధం లేదని బాధితుడు బత్తిని మహేందర్ గౌడ్ అన్నారు. లచ్చపేటలోని సర్వే నంబర్ 25 ,26 లలో ఉన్న భూమి తన తండ్రి బత్తిని కిష్టయ్య పేరున ఉందని. కొందరు అక్ర మార్కులు అధికారులు, రాజకీయ నాయకులతో కుమ్మక్కై, తమకు చెందిన భూమిలోంచి 1805 గజాలు సిరిసిల్లకు చెందిన ఓ వ్యక్తి పేరున నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని ఆరోపించారు. శుక్రవారం దుబ్బా కలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ పరిధి లోని లచ్చపేటలో 25, 26 సర్వే నంబర్లు 1958 నుండే తన తాత బత్తిని సీతయ్య పేరిట రికార్డుల్లో ఉందని, ఆ తర్వాత తన తండ్రి బత్తిని కిష్టయ్య పేరిట మార్పిడి జరిగిందని తెలిపారు. ఇప్పటికీ ఆ భూమి బత్తిని కిష్టయ్య పేరిట ఉందన్నారు. తాము ఉపాధి కోసం వలస పోవడం వలన తమ భూమిని కొందరు కబ్జా చేయడంతో 1995 లో వారిపై కోర్టులో కేసు వేయడం జరిగిందని, కోర్టు ద్వారా తమకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ వచ్చిందన్నారు. అప్పటి నుంచి నేటికీ కోర్టు పరిధిలో కేసు నడుస్తుండగా లచ్చపేటకు చెందిన కొందరు అక్రమార్కులు స్థానిక ప్రజాప్రతినిధుల అండతో తప్పుడు పత్రాలు సృష్టించి తమ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు కేసు నడుస్తున్నందునా తమకు చెందిన ఆ భూమికి సంబంధించి ఎలాంటి కొనుగోల్లు చేసి చిక్కుల్లో పడవద్దని సూచించారు.

ఎరుకల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి

- జిల్లా అధ్యక్షులు కెమ్మసారం మురళి



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎరుకల కులస్తులకు రాజకీయ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికి తోడ్పడాలని టీవైఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం మురళి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ట్రైబల్ నోడల్ ఆఫీసర్ లక్ష్మి ప్రసాద్‌ను కలిసి ఎరుకల కులస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కుల సభ్యులతో కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరకల కులవృత్తి అంతరించిపోవడంతో ఎలాంటి జీవనోపాధి లేకుండా ఉన్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించి, వారి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. తమ పిల్లలు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లలో ఉన్నత చదువులు చదువుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. హైదరాబాదు ట్యాంక్ బండ్ వద్ద ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సిద్దిపేట జిల్లా 26 మండలాలలో ఐదెకరాల స్థలాన్ని కేటాయించి, పందుల ఫామ్‌ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కార్యాలయం లేకపోవడం వలన చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. జిల్లాకు శాశ్వత ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీస్‌ను నియమించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అనంతరం కుల సంఘ నాయకులతో కలిసి ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం అధ్యక్షులు కెమ్మసారం రాజేష్ ఖన్నా, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సభ్యులు రవీందర్, నర్సింలు, లక్ష్మణ్, శ్రవణ్ కుమార్, శ్రీనివాస్, భగవాన్, బాలకృష్ణ, ఏకలవ్య మిత్రమండలి అధ్యక్షులు బండి యాదగిరి, సభ్యులు దేవరాయ ఎల్లం, బండి నర్సింలు, కనకయ్య, వెంకట్, వివిధ మండల కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనలో అప్పుల పాలవుతున్న పంచాయతీ కార్యదర్శులు

- టెజరీలో నెలలకొద్దీ పెండింగ్‌లో ఫ్రీజింగ్ ఉంచిన బిల్లులు
- జాయింట్ సెక్రెటరీ గర్నేపల్లి ప్రశాంత్



నవతెలంగాణ-జగదేవపూర్

గ్రామ పంచాయతీల నిర్వహణ భారంగా మారిందని టీఎన్జీవో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర విభాగం జాయింట్ సెక్రెటరీ గర్నేపల్లి ప్రశాంత్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు సర్పంచుల పదవీకాలం ముగిసి పది నెలలైనా ఇప్పటికీ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధికారికంగా రావలసిన నిధులు పది నెలల నుంచి విడుదల చేయక గ్రామపంచాయతీలో విధి నిర్వహణ పంచాయతీ కార్యదర్శుల మెడకు చుట్టుకుందన్నారు. ప్రతినెల ట్రాక్టర్ చెత్త బండి నిర్వహణ, పోయిన నెల దసరా, బతుకమ్మ పండుగల నిర్వహణ శానిటేషన్ నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ, త్రాగునీరు నిర్వహణ, ఇతర ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చే పనుల నిర్వహణ, అన్ని ఖర్చులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదల కాక పంచాయతీ కార్యదర్శులు వడ్డీలకు అప్పు తెచ్చి నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటివరకు కూడా ఆర్థిక శాఖ ట్రెజరీలో పెండింగ్లో ఉన్న బిల్లులు కూడా క్లియర్ కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పుల్లో మునిగిపోతున్నా రన్నారు. కావున వెంటనే ప్రభుత్వం అధికా రులు స్పందించి పెండింగ్లో ఉన్న బిల్లులు క్లియర్ చేసి, ప్రతి నెల గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లిస్తూ కనీస నిర్వహణకు నిధులను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని అన్నారు. సమగ్ర సర్వేలో కూడా పంచాయతీ కార్యద ర్శులదే కీలక పాత్ర నిర్వహిస్తున్నందున, ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మేనిఫెస్టోలో పెట్టిన హామీ మేరకు రెగ్యులర్ కాని పంచాయతీ కార్యదర్శులను వెంటనే ప్రొబేషన్ డిక్లేర్ చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులర్ అయిన పంచాయతీ కార్యద ర్శులకు కట్ ఆఫ్ తేదీ ప్రకటించి బెనిఫిట్స్ ఇవ్వాలని, అవుట్సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వారి సర్వీస్ కౌంట్ చేస్తూ రెగ్యులర్ చేయాలని, అందరి కార్యదర్శులకు సర్వీసును బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని, పంచాయతీలను గ్రేడ్లుగా విభజించాలని కోరారు.

విజయ్‌కి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం రావడం గర్వకరణం



నవతెలంగాణ-రాయపోల్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-4 ఉద్యోగ ఫలితాలలో ముబారస్ పూర్ గ్రామానికి చెందిన నిరుడు విజయ్‌కి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం రావడం గ్రామానికి గర్వకారణమని బీఆర్ఎస్ నాయకులు తుప్పతి నరేష్ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ గ్రామంలో నిరుడు విజయ్‌ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానం, తెలివి ముందు పేదరికం అడ్డు కాదని ప్రతి ఒక్కరూ జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టంతో చదివితే విజయం సాధించవచ్చున్నారు. విజయ్ పేద కుటుంబంలో జన్మించినప్పటికీ ఎంతో కష్టపడి చదివి జాబితాలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించడం ముబారస్ పూర్ గ్రామానికి గర్వకారణంగా ఉందన్నారు. గ్రామ యువత విజయ్‌ని ఆదర్శంగా తీసుకుని మరి ఎంతోమంది ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంజ ప్రవీణ్, పంజ రాజు, పంజ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలు దళారులను నమ్మి మోసపోవద్దు

- రాయపోల్ ఏపీఎం ఆస కిషన్



నవతెలంగాణ-రాయపోల్

అన్నదాతలు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని రాయపోల్ ఐకేపీ ఎపీఎం ఆస కిషన్ అన్నారు. శుక్రవారం మండలం అనాజీపూర్, మంతూర్ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అలాగే రాంసాగర్ గ్రామంలో సమగ్ర కుటుంబ ఇంటిని సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు దళారుల నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించి, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. ఐకేపీ కేంద్రాలను రైతులకు అవసరమైన కనీస వసతులను సమకూర్చుకోవాలని సీఎలకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలందరూ పాల్గొని వారి యొక్క కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం రాష్ట్ర ప్రజల స్థితిగతులు ఆర్థిక సామాజిక రాజకీయ ఉపాధి అంశాల వంటి వివరాలను వాస్తవికంగా తెలుసుకోవడం కోసం నిర్వహిస్తున్నారు. కాబట్టి ప్రజలందరూ తప్పనిసరిగా సర్వేలో వారి పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ, సిఏలు, రైతులు పాల్గొన్నారు.

దళితులను విడదీసేందుకే బీజేపీ కుట్ర



- మాలల మహా పాదయాత్ర కరపత్రం ఆవిష్కరణ
- తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

నవతెలంగాణ-మద్దూరు

దళితులను విడదీసేందుకే ఎస్సీ వర్గీకరణను బీజేపీ చేస్తుందని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మహా పాదయాత్ర కరపత్రాన్ని మద్దూరు మండల మాల మహానాడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ నేతృతంలో అక్టోబర్ 25న భద్రాచలంలో పాదయాత్రను ప్రారంభించారని ఆయన తెలిపారు. దళితులను విడదీసే కుట్ర రాజకీయ పార్టీలు చేస్తున్నాయని ఆ కుట్రలను తిప్పికొట్టేందుకు దళితులంతా కలిసి ఉండి రాజాధికారం వైపుకు అడుగులు వేయాలని ఆయన కోరారు. అక్టోబర్ 25న భద్రాచలంలో మొదలై 38 రోజులు 35 నియోజకవర్గాలు 16 జిల్లాలు 1000 కిలోమీటర్లు పాదయాత్ర చేసి హైదరాబాదులో డిసెంబర్ 1న ముగింపు కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. ముగింపు సమావేశానికి మాలలు మాల అనుబంధ కులాలు ఉద్యోగస్తులు, విద్యార్థులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మండల అధ్యక్షులు బొప్పె నాగయ్య, సిద్దిపేట జిల్లా ప్రచార కార్యదర్శి మేడిపల్లి నరసింహ, డివిజన్ అధ్యక్షులు చింతల విజయ్ కుమార్, మాల మహానాడు నాయకులు కొమురవెల్లి కనకయ్య, రాగుల బాల నరసయ్య, నీల బాలకృష్ణ, తాటి రాజయ్య, బెల్లి వెంకటయ్య , చేంచల అశోక్, సిలివేరి రాజు, నీరటి క్రాంతి, పాల్గొన్నారు.